క్లుప్తంగా

వేరుశనగ రైతుకు వర్షం దెబ్బ


వేరుశనగ కాయలను ఆరబెడుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శనివారం అర్ధరాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. భారీ వర్షంతో కల్లలలో ఉన్న వేరుశనగ కాయలు తడిచి ముద్దయ్యాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుకాలం కష్టించి పండించి పంట వర్షానికి తడిచిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 1000 ఎకరాలలో వేరుశనగ పంటను సాగు చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో జోరుగా వేరుశనగ ఒబ్బిళ్లు సాగుతున్నాయి. కాయలు తడిసిపోవడంతో ధర తగ్గిపోతుందని రైతులు బాధ పడుతున్నారు. తడిచిన కాయలను రైతులు ఆరబెట్టుకుంటున్నారు. ప్రభుత్వం తడిసిన కాయలను కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద అన్నదానం


జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

కేవీబీపురం: వైఎస్‌ఆర్ సీ కేవీబీపురం మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య జన్మదిన వేడుకలు స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి,నాయకులు,కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద కార్యకర్తలు నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే పీహెచ్‌సీలో వృద్ధులు, రోగులకు పాలు, పండ్లు, దుప్పట్లు పంచిపెట్టారు. అనంతరం శివనాథపురంలోని అమ్మా వృద్ధాశ్రమంలోని 100 మంది వృద్ధులకు అన్నదానంచేసి, చీరలు పంచిపెట్టారు.

భక్తులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు


సేవలందిస్తున్న స్కౌట్ విద్యార్థులు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఆడికృత్తిక ఉత్సవాల్లో ఆదివారం వంద మంది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ వలంటీర్లు భక్తులకు సేవలందించారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్థానిక జెడ్పీ బాలుర, బాలికల, సరస్వతిబాయి ఉన్నత పాఠశాలలు, బాబు అగ్రహారం ఉన్నత పాఠశాల, భాస్కరపేట ఉన్నత పాఠశాలల స్కౌట్స్ అండ్ గైడ్స్ తమ సేవలందించారు. కార్యక్రమంలో సావిత్రి, సులోచన, ఎస్‌కే అజారుద్దీన్, సుబ్రహ్మణ్యం, మణికంఠ, విద్యాసాగర్, మహేంద్ర, సరిత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో కలెక్టరేట్


కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసి ఉన్న సీసీ కెమెరాలు

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం నిఘా నీడలోకి వచ్చింది. తిరుచానూరు వద్దనున్న పద్మావతీ నిలయంలో ఉన్న కలెక్టరేట్‌లో 40 శాఖలకు సంబంధించి 500 మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. నిత్యం వందలాది మంది ప్రజలు వివిధ సమస్యలు నివేదించేందుకు వస్తుంటారు. ఇక సోమవారం అయితే జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చి అర్జీలు ఇవ్వడం, మరికొందరు సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వెలుపల ఆందోళన చేయడం పరిపాటి. ఈ నేపథ్యంలో ఇక్కడ రాకపోకలకు సంబంధించి ప్రత్యేకంగా మూడు కెమెరాలను ఇటీవలే ఏర్పాటు చేశారు.

నృత్యం..మంత్రముగ్ధం



చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలోవారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం తిరుపతికి చెందిన పెద్దబాబయ్య శిష్య బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. మూషిక వాహన– అంటూ సాగిన పాటతో మొదలై వేదములే శ్రీనివాసం, ముద్దుగారే యశోద, నగుమోము కనలేని, భో శంభో, పుష్పాంజలి, శ్రీరామ నీ నామము, అయిగిరి నందిని, ఒకపరి ఒకపరి, బ్రహ్మమొక్కటే..తదితర పాటలకు కళాకారులు వేదశ్రీ, కేథరిన్, హేమస్విని, ధనలక్ష్మి, ధనశ్రీ, హరి, నితిన్, దుర్గ, భవిష్య తమ నృత్య ప్రదర్శనతో మంత్రముగ్ధుల్ని చేశారు. ఇన్‌చార్జ్ ఏఓ సూర్యతేజ కళాకారులను సత్కరించారు.

హరోంహర

- విజ్ఞానగిరికి పోటెత్తిన భక్తులు
- భక్తిప్రపత్తులతో కావడి మొక్కులు చెల్లింపు


క్యూలలో భక్తులు


తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ కుమారస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆడికృత్తిక పురస్కరించుకుని స్వామివారి దర్శనార్థం వేలాది మంది తరలివచ్చారు. హరోం హర నామస్మరణతో విజ్ఞానగిరి మార్మోగింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు కావళ్లు మోస్తూ విజ్ఞానగిరికి వచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొక్కిసలాటలకు దారితీయకుండా రెండు మార్గాలతోపాటు క్యూలు ఏర్పాటు చేయడంతో ఏ ఇబ్బందులూ లేకుండా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణానికి చెందిన పలువురు ఈ ఏడాది కూడా ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్తికేయ మిత్రబృందం ఏర్పాటు చేసిన ప్రసాదాల పంపిణీని ఈఓ బాపిరెడ్డి ప్రారంభించారు.

నారద పుష్కరిణిలో కల్యాణకట్ట

నారద పుష్కరిణలో అధికారులు కల్యాణ కట్ట ఏర్పాటు చేశారు. పలువురు భక్తులు అక్కడ తలనీలాలు సమర్పించి అక్కడే ఏర్పాటు చేసిన స్నానఘట్టాల వద్ద స్నానాలు ఆచరించారు. ఇక, విజ్ఞానగిరి వద్ద ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంద్ర విమానంపై కుమారస్వామి విహారం

శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఇంద్ర విమానంపై పురవిహారం చేశారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించారు.


ఆలయం వద్ద భక్తులు


స్నానాలు చేస్తున్న భక్తులు


భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న కార్తికేయ సేవా సంఘం

నాగలాపురంలో చోరీ కలకలం

నాగలాపురం: బజారు వీధిలోని మహావీర్ బంగారు దుకాణంలో బంగారు చైను చోరీ జరిగినట్లు షాపు యాజమాని జస్‌రాజ్ జైన్ తెలిపారు. బాధితుని కథనం మేరకు శనివారం మధ్యాహ్నం ఇద్దరు మహిళలు బంగారు చైను కావాలని దుకాణానికి వచ్చారని తెలిపారు. తరువాత వెండి కాళ్ల పట్టీలు కావాలని కోరగా పట్టీలు తీసే సమయంలో షాపులో ఉన్న 12 గ్రాములు బరువైన రెండు బంగారు గొలుసులు చోరీ చేశారని పేర్కొన్నారు. బంగారు చైనులు పోగొట్టుకున్న విషయం ఆలస్యంగా గ్రహించిన షాపు యాజమని సీసీ కెమెరాల ఆధారంగా మహిళలు బంగారు చైనును దుస్తులలో పెట్టి తీసుకెళ్లారని తెలుసుకున్నాడు. ఆదే రోజు అర్ధరాత్రి పైబడ్డాక ఇద్దరు యువకులు ఇనుప గడ్డపారతో దుకాణం షట్టరును పగల కొట్టడానికి ప్రయత్నించారని, ఎంత ప్రయత్నించినా తాళాలు పగలక పోయే సరికి దుండగులు వెళ్లి పోయినట్లు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈ సంఘటనపై సమగ్రంగా విచారించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

కావడి మహోత్సవం

తడ: ఆడి మాసంలో వచ్చే కృత్తిక సందర్భంగా ఆదివారం మాంబట్టులో కావడి మహోత్సవం నిర్వహించారు. స్విమ్స్ వైద్యులు కారణి మునుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కావడి మహోత్సవంలో మహిళలు, పురుషులు కావడి ధరించారు. మేళతాళాలు, కోలాట నృత్యాల నడుమ గ్రామంలో ఊరేగిన అనంతరం సుబ్రమణ్యస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. తమిళ సంప్రదాయం పాటించే రామాపురం, కారూరు, పూడి, బీవీపాళెం, పెరియవట్టు పంచాయతీల పరిధిలో కావడి మోసిన భక్తులు తమిళనాడులోని తిరుత్తణి, ఆండాళ్ కుప్పం ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించారు.

గుత్తి త్యాగరాజుకు సత్కారం


సత్కారం అందుకుంటున్న గుత్తి త్యాగరాజు

వరదయ్యపాళెం: పురోహిత పరిషత్ ఆధ్వర్యంలో వరదయ్యపాళెంకు చెందిన దేవాంగ సంఘం నాయకులు గుత్తి త్యాగరాజుకు సత్కారం లభించింది. పురోహిత పరిషత్ 4వ వార్షికోత్సవం సందర్భంగా చీరాల నియోజకవర్గం ఆమోదగిరి పట్టణంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ సత్కారం అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గుత్తి త్యాగరాజు సమాజానికి ఆధ్యాత్మికతతోపాటు సేవా మార్గాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. అలాగే వరదయ్యపాళెంలోని గోవర్ధనపురానికి చెందిన పురోహితులు బొప్పన మోహన్‌బాబుకు సత్కారం చేపట్టారు.

నాయకత్వ లక్షణాలతో ముందుకు..


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


శ్రీకాళహస్తి: విద్యార్థులు నాయకత్వ లక్షణాలతో ముందుకు పోవాలనిని రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక శ్రీ చైతన్య స్కూల్‌లో విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీఐ ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమిస్తే దానిని చేరుకోగలరన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలపై అవగాహన, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

వ్యాపార రంగాల ఉన్నతికి చక్కటి వేదిక బీఎన్‌ఐ


తుడా చైర్మన్‌ను సత్కరిస్తున్న బీఎన్‌ఐ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: వివిధ వ్యాపార రంగాలు, పారిశ్రామిక రంగాలలోని వారు ఉన్నతంగా ఎదిగేందుకు బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్(బీఎన్‌ఐ) చక్కటి వేదికగా దోహదపడుతుందని తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతిలోని ఓ ఫంక్షన్ హాల్లో బీఎన్‌ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో కాన్‌క్లేవ్–2.0 పేరిట వ్యాపార, పారిశ్రామికవేత్తల సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తుడా చైర్మన్ మాట్లాడారు. వెయ్యికి పైగా బిజినెస్ సంస్థలను ఒక చోట చేర్చి బిజినెస్ ఐడియాలజీలను ఇతర కంపెనీలతో పంచుకునేందుకు బీఎన్‌ఐ కృషి చేయడం అభినందనీయమన్నారు. బీఎన్‌ఐ ఈడీ మాట్లాడుతూ, వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు తమ వ్యాపారాలను అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు ప్రతి ఏటా ఇలాంటి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం బీఎన్‌ఐ సభ్యులు, పారిశ్రామి వేత్తలు వివిధ అంశాలపై చర్చించారు. బీఎన్‌ఐ తిరుపతి రీజియన్ చైర్మన్ మణి సందీప్, కో–చైర్మన్ టింకాలయ దుర్గాప్రసాద్, కన్వీనర్ యుగంధర్, స్పాన్సర్ కో–ఆర్డినేటర్ వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆడికృత్తిక వేడుకలు




చెన్నై రోడ్డులోని షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద భక్తులు

తొట్టంబేడు: మండలంలోని చెన్నై రోడ్డు ఉన్న షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అర్చకులు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

పాపానాయుడుపేటలో..

ఏర్పేడు: మండలంలో పాపానాయుడుపేటలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆదివారం ఆడికృతిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి,అమ్మవార్లకు అభిషేక పూజలు చేసి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కావళ్లతో వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించారు. పాపానాయుడుపేటకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం మేకళత్తూరు ఏలుమలై మొదలి, ఎం.జయలక్ష్మి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామివారిని విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త మురుగప్ప మొదలి, గ్రామస్తులు పాల్గొన్నారు.

108 వేలాయుధాలతో నగరోత్సవం



నాయుడుపేటటౌన్: ఆడికృత్తిక సందర్భంగా ఆదివారం పట్టణంలోని వల్లి దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం నుంచి 108 వేలాయుధాలతో స్వామివారి నగరోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ ఆధ్వర్యంలో 108 మంది భక్తులు స్వామి వారి వేలాయుధాలను చేతపట్టి స్వామివారి నగరోత్సవంతో పాల్గొన్నారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లు చందనం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయం వద్ద స్వామివార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.

నాలుక మడతేసిన మంత్రి లోకేష్


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

- స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించండి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి పిలుపు

తిరుపతి కల్చరల్: అదాని కంపెనీ ప్రయోజనాల కోసమే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని, ప్రజలపై భారాలుమోపే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మూలం రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. 'స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి' అని ఎన్నికల ప్రచారంలో పిలుపునిచ్చిన నారా లోకేష్ అధికారంలోకి వచ్చాక నాలుక మడతపెట్టి, స్మార్ట్ మీటర్లు బిగించడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీల మోతకు వ్యతిరేకంగా ఈనెల 16 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. టీటీడీని నిత్యం వివాదాలకు కేంద్రంగా మారుస్తున్నారని, కేంద్రంలోని బీజేపీ నేతలు, మంత్రులు, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఇందుకు మినహాయింపేమీ కాదని మండిపడ్డారు. తిరుపతిలో మత ఉద్రిక్తతలు పెంచడమే లక్ష్యంగా బీజేపీ కార్యకలాపాలు ఉంటున్నాయని, దీనిపై ప్రజలు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కందారపు మురళి, సుబ్రమణ్యం, పుల్లయ్య, సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, జయచంద్ర, వేణుగోపాల్, శివకుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

వేమాలమ్మకు గ్రామ పొంగళ్లు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని కూచివాడ గ్రామంలో ఆదివారం గ్రామ దేవత వేమాలమ్మకు గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు వారి ఇళ్ల వద్ద నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని గ్రామ పొంగళ్లు పెట్టుకుని అమ్మణ్ణికి మొక్కులు చెల్లించుకున్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టు దారుణం

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడంపై వైఎస్‌ఆర్ సీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. వైఎస్‌ఆర్ సీపీ ముఖ్యనేతలను అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడమే కూటమి పనిగా పెట్టుకుందని విమర్శించారు. –కేవీబీ పురం /బుచ్చినాయుడుకండ్రిగ / వరదయ్యపాళెం/ నారాయణవనం / రేణిగుంట

చంద్రబాబుకు పెద్దిరెడ్డి భయం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తూరు ఉమ్మడి జిల్లాలో పెద్దిరెడ్డి భయం పట్టుకుంది. రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టోను పెద్దిరెడ్డి కుటుంబం ఉధృతం చేసి, చంద్రబాబు పరువు తీస్తోందని భయపడి ఎంపీ మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపింది. మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా త్వరలోనే బయటికి వస్తారు. –గవర్ల కృష్ణయ్య, వైఎస్‌ఆర్ సీపీ అధ్యక్షుడు, కేవీబీపురం

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు



వైఎస్‌ఆర్ సీపీ నేతల పోరాటాలకు చంద్రబాబు భయపడుతున్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఎంపీ మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టారు. ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని చంద్రబాబు, లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కేవలం తప్పుడు కేసులకే ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఇదే టీడీపీకి చివరి అధికారం. –తేరణి ధనుంజయరెడ్డి, ఉమ్మడి జిల్లా వైఎస్‌ఆర్ సీపీ ఉపాధ్యక్షుడు, కేవీబీపురం

దద్దమ్మ ప్రభుత్వం



పాలన చేతగాక, ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఇందులో భాగంగానే జగన్‌మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపింది. కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని గాలికి వదిలేసి, మా నేతలపై తప్పుడు కేసులు పెట్టేందుకే అధికారాన్ని వినియోగిస్తోంది. –మాధవిరెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు, కేవీబీపురం

చంద్రబాబు ప్రభుత్వానికి కాలం చెల్లింది



ప్రతిపక్ష పార్టీ నేతలను వేధించడం, తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడం, కేసుల నుండి స్టేలు తెచ్చుకోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. వైఎస్‌ఆర్ సీపీ ముఖ్యనేతలపై అక్రమ కేసులు పెట్టి, అరెస్ట్ చేసి జైలుకు పంపే చర్యలు దారుణం. చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. –లాల్‌బాబు యాదవ్, వైఎస్‌ఆర్ సీపీ ప్రధాన కార్యదర్శి, తిరుపతి జిల్లా

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం



ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు అక్రమం. ప్రజల్లో పెద్దిరెడ్డి కుటుంబానికి ఉన్న విలువ, ఆదరణను దెబ్బతీయాలన్న ఉద్దేశంతో తప్పుడు కేసు బనాయించారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, వారికి నచ్చని వారిపై వ్యూహం ప్రకారం కేసులు బనాయిస్తున్నారు. –ఉగ్గుమూడి గురునాథం, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, బుచ్చినాయుడుకండ్రిగ

అక్రమ అరెస్టులతో ప్రజాభిమానాన్ని అడ్డుకోలేరు



రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని విచారణ పేరుతో సిట్ కార్యాలయానికి పిలిపించి అరెస్టు చేయడం అప్రజాస్వామ్యం. పెద్దిరెడ్డి కుటుంబాన్ని అణగదొక్కాలనే కక్షతో మిథున్‌రెడ్డికి సంబంధం లేని మద్యం స్కాంను అంటగట్టి కేసులు బనాయించారు. ఈ దుర్మార్గపు చర్యలపై ప్రజల్లో కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ కేసులతో ఎవరినీ భయపెట్టలేరు. –చిన్నా, చిత్తూరు ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి, వరదయ్యపాళెం

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అరాచకం

రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అరెస్టు అరాచక రాజకీయానికి పరాకాష్ట. ప్రజా ప్రతినిధుల గొంతును నొక్కి, విపక్ష నేతలపై దాడులకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం నేర్పుతారు. అక్రమ అరెస్టులకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలకాలి. –వైఎస్సార్ సీపీ జిల్లా క్రియాశీల కార్యదర్శి రాకేష్ కిరణ్, రాష్ట్ర వాణిజ్య విభాగ సంయుక్త కార్యదర్శి అన్నాదొరై , నారాయణవనం

దిగజారుడుతనానికి నిదర్శనం



ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ సీఎం చంద్రబాబు దిగజారుడుతనానికి నిదర్శనం. జిల్లాలో రాజకీయంగా పెద్దిరెడ్డి కుటుంబానికి ఉన్న ప్రజాదరణను చూసి ఓర్వలేనితనంలో అక్రమంగా అరెస్ట్ చేశారు. –సి.తిరుమలరెడ్డి, మాజీ జెడ్పీటీసీ, రేణిగుంట

రాజకీయ కుట్రతోనే కక్ష సాధింపు



ఎంపీ మిథున్‌రెడ్డిని కక్ష సాధింపులో భాగంగా అరెస్టు చేశారు. వ్యక్తిగతంగా పెద్దిరెడ్డి కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసింది. రాజకీయంగా ఎదుర్కోలేక అధికారాన్ని అడ్డుపెట్టుకొని తప్పుడు కేసులు పెట్టారు. ఇలాంటి అరెస్టులకు వైఎస్సార్ సీపీ నాయకులు భయపడేది లేదు. –ఆరణి సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత, బుచ్చినాయుడుకండ్రిగ

ఇదంతా డైవర్షన్ పాలిటిక్స్

అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక జనాన్ని ఏమార్చేందుకు చంద్రబాబునాయుడు కుయుక్తులు పన్నుతున్నాడు. లిక్కర్ కేసు తప్పుడు కేసని జనానికి తెలుసు. ఎంపీ మిథున్‌రెడ్డి జగనన్నకు సన్నిహితంగా ఉన్నాడనే కారణంతోనే కేసులో అన్యాయంగా ఇరికించారు. –మణినాయుడు, వైఎస్సార్ సీపీ కన్వీనర్, బుచ్చినాయుడుకండ్రిగ